# విదేశాలలో వలస కార్మికుల దుస్థితి భారత ప్రభుత్వ ఘోర నిర్లక్ష్యం

**వివిధ** ప్రపంచ దేశాలలో భారత కార్మికు లనుభవిస్తున్న దుర్భర వాస్తవ స్థితిగతులకు సంబంధించి, ప్రతి సంవత్సరం చాలా ఆర్భాటంగా 'ప్రవాస భారతీయ దివస్'ను ఘనంగా నిర్వహిస్తూ, వరుసగా అధికారంలో కొస్తున్న ప్రభుత్వాలు, పాలకులు భారత ప్రజలను చీకటిలో వుంచుతున్నారు. అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్న ఉన్నత సాంకేతిక వృత్తి నిపుణులైన కొందరు 'వైట్‌కాలర్' ఉద్యోగులను చూపెడుతూ, విదేశాలలో పనిచేస్తున్న కార్మికులంతా అదేవిధంగా వున్నారన్నట్లుగా మనల్నందరినీ నమ్మించటానికి మన పాలకులు ప్రయత్నిస్తున్నారు.

ఈ విధమైన ప్రదర్శనాత్మక వేడుకలుగానీ, లేదా విదేశాలలోని కార్మికుల ప్రయోజనాలను పరిరక్షించటంలో భారత ప్రయత్నాలుగా చెప్పబడే సుష్మాస్వరాజ్ యొక్క బహుళ ప్రచారం పొందిన వాగాడంబర ప్రదర్శనలుగానీ – విదేశాలలోని భారత కార్మికులు ఘోరనిర్లక్ష్యానికి గురిచేయబడుతున్నారన్న వాస్తవాన్ని మరుగుపరచలేవు.

39 మంది భారతీయ కార్మికులు మోసుల్‌జైల్లో నిర్బంధించబడగా, మూడు సంవత్సరాల తర్వాత ఈనాటికీ వారు సజీవంగా వున్నారో లేదో తెలుసుకోలేకపోయిన ఘటన – విదేశాలలోని భారత కార్మికుల దుస్థితిపట్ల మన ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని, పట్టనితనాన్ని, మన పాలకుల మోసకారీతనాన్ని ఎంతగానో వెల్లడిచేస్తోంది.

విదేశీ మారకద్రవ్య నిల్వల స్థితిని భద్రంగా కాపాడుకోగలగటానికి, విదేశాలనుండి కార్మికులు పంపుతున్న డబ్బే ప్రధానమైనదనే అంశాన్ని పాలకులు మరుగునపెడ్తున్నారు. ప్రత్యేకించి ఇదంతా, నైపుణ్య రహిత, అర్ధ – నైపుణ్య కార్మికులు తమ కుటుంబాలకు పంపే డబ్బే తప్ప విదేశాలలోని ఉన్నతోద్యోగులు పంపుతున్నది కాదు. విదేశీమారకద్రవ్య సమతౌల్యస్థితి ఈ విధంగా కాపాడబడతూ వస్తోంది. మనదేశ స్థూలదేశీయ ఉత్పత్తి (జిడిపి)లో విదేశీ కార్మికుల చెల్లింపులు దాదాపు 3.2 శాతంగా వున్నాయి. అయితే, ఇంతగా భారత ఆర్థికవ్యవస్థకు తోడ్పాటునందిస్తున్న విదేశాల్లోని ఈ కార్మికులను ఆదుకోవటానికి బదులుగా, మన పాలకులు, వరుసగా పాలన సాగిస్తున్న ప్రభుత్వాలు వారిని నిర్లక్ష్యం చేస్తున్నాయి. అమెరికా, పశ్చిమ యూరపు దేశాలకు వలసవెళ్ళి, మనదేశంతో సంబంధాలను పూర్తిగా తెంపుకున్న ఉన్నతోద్యోగులనే ఈ ప్రభుత్వాలు నెత్తిపైకి ఎక్కించుకుంటున్నాయి. దీనికి భిన్నంగా, నైపుణ్యరహిత, అర్ధనైపుణ్య కార్మికులు విదేశాలలో కష్టించి పనిచేయటానికి వెళ్ళారు మినహా అక్కడ స్థిరపడటానికి కాదు. వీరంతా నిర్దిష్ట ఉద్యోగాల కోసం స్వల్పకాలిక ఒప్పందాలపై విదేశాలకువెళ్ళి, ఒప్పందం ముగిసిన తర్వాత స్వదేశం తిరిగి వచ్చేవారే.

మధ్యదళారీల, ఏజెంట్ల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి పశ్చిమాసియా, సింగపూర్‌లలో 70 లక్షల మంది నిరక్షరాస్యులైన, నైపుణ్యరహిత, అర్ధ – నైపుణ్య భారత కార్మికులు తమ శ్రమను అమ్ముకుంటూ జీవిస్తున్నారు.

తమ అమానవీయ జీవన, పనిపరిస్థితులకు వ్యతిరేకంగా కొద్ది సం॥ల క్రితం మూడువేలమంది భారతీయ కార్మికులు దుబాయ్‌లో ఆందోళన చేశారు. వారు తమ న్యాయమైన డిమాండ్లను రద్దుచేసుకొని, దిక్కులేక పనిచేయవలసి వస్తోంది. తమ సహకార్మికుడి మరణానికి కారణమైన దుర్భర పరిస్థితులకు వ్యతిరేకంగా ఆందోళనలో పాల్గొన్నందుకుగాను 300 మంది కార్మికులను సింగపూర్ ప్రభుత్వం శిక్షించింది. ఇవన్నీ విదేశాల్లో భారత కార్మికుల దుర్భర స్థితిగతులను, దుస్థితిని, భారత ప్రభుత్వ సహకారం లేకపోవటాన్ని, వారి జీవన స్థితిగతులను మెరుగుచేయని ఘోర నిర్లక్ష్యాన్ని స్పష్టంగా వివరిస్తున్నాయి.

భారతదేశం నుండి విదేశాలకు పనులకోసం వెళ్ళిన కార్మికులలో 70 శాతం మంది కార్మికులు గల్ఫ్ దేశాలలో జీవిస్తుండగా, మిగిలినవారు ఆసియా దేశాలైన సింగపూర్, మలేసియాలలో, యూరప్, అమెరికా దేశాలలో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మొత్తంగా దాదాపు 3 కోట్లమంది భారతదేశ కార్మికులు విదేశాలలో పనులు చేస్తూ జీవిస్తున్నారు.

గల్ఫ్ దేశాలలో పనిచేస్తున్న కార్మికులు నిరంతరాయంగా క్రూరమైన దోపిడీకి, వేధింపులకూ గురిచేయబడుతూ మార్గాంతరంలేని బతుకులీడుస్తున్నారు. చమురు ధరల హెచ్చుతగ్గులకారణంగా గల్ఫ్ దేశాలలో సంభవించిన ఇటీవలి సంక్షోభం; మరియు చమురేతర ఆదాయాలను పెంచుకోవాలనే, తమ దేశీయులకే అధికంగా పని కల్పించాలనే గల్ఫ్‌దేశాల నిర్ణయం–గల్ఫ్ దేశాలలోని భారత కార్మికుల దురవస్థను మరింత తీవ్రతరం చేసింది. ప్రత్యేకించి, ఇతర అరబ్ దేశాలు ఖతార్‌తో సంబంధాలను తెంచుకున్న తర్వాత ఖతార్‌లోని భారత కార్మికుల పరిస్థితి మరీ ఘోరంగా మారింది. దీనితో ఖతార్‌లో భవన నిర్మాణరంగం తీవ్రంగా ప్రభావితమైంది. ఈ విభాగంలోని 2 లక్షలమంది విదేశీ కార్మికులు పని కోల్పోయారు. ఖతార్ నుండి సంవత్సరానికి 27 కోట్ల రూపాయలను మన దేశానికి పంపించే దాదాపు 6.5 లక్షలమంది భారత కార్మికులున్నారు. ప్రస్తుతం ఈ కార్మికులంతా ఉద్యోగాలు కోల్పోయారు. వీరిలో అత్యధికులకు గతంలో చేసిన పనికిగాను చెల్లించవలసిన బకాయిలుకూడా చెల్లించబడలేదు. దాదాపు 3 లక్షలమంది విదేశీ కార్మికులు ఖతార్‌ను వీడి వెళ్ళారు. అత్యధిక భారతీయ కార్మికులు ఖతార్‌లో చిక్కుకుపోయారు. ఖతార్ తాత్కాలిక వీసాలతో సౌదీ అరేబియాలోని ఖతార్ యజమానుల వద్ద పనిచేసిన కార్మికులు, వీసాలులేని చట్టవిరుద్ధ కార్మికులుగా పరిగణింపబడి పనిలేక, ఆహారంలేక సౌదీఅరేబియాలో చిక్కుకుపోయి వున్నారు. వీరిలో అత్యధిక కార్మికులు భారతదేశం తిరిగి రావటానికంటే, సౌదీఅరేబియా

జైళ్ళలో వుండిపోయేందుకే సిద్ధమవుతున్నారు. స్వదేశం వచ్చినా వారికి ప్రత్యామ్నాయ జీవనోపాధిలేకపోవటం, సౌదీఅరేబియా రావటంకోసం అధికంగా అప్పుచేసి వుండటమనే కారణాలు వారిని ఈ స్థితికి నెదుతున్నాయి.

కేంద్రప్రభుత్వం కానీ లేదా సంబంధిత రాష్ట్రాల ప్రభుత్వాలుకానీ, దుస్థితిలో వున్న భారత కార్మికుల సమస్యల పరిష్కారాన్ని కనుగొనే నిజాయితీతో కూడిన ప్రయత్నాలేమీ చేయటంలేదు. పైగా, దుస్థితిలోవున్న గల్ఫ్ దేశాల కార్మికులను ఆదుకోవాలని ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్న ప్రజలను శుష్కవాగ్దానాల ప్రచారంతో నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు.

30వేల మంది భారతీయులు ఇటలీ దేశ తోటలలో పనిచేస్తున్నారు. వారితో రోజుకు 13 గం॥లపాటు బలవంతంగా శ్రమ చేయిస్తున్నారు. వీరిలో అత్యధికులు రోమ్ నగరానికి దక్షిణ ప్రాంతంలోని తోటల్లో పనిచేస్తున్నారు. స్వల్ప వేతనాలతో వీరిని క్రూరంగా దోపిడీ చేస్తున్నారు. ఒక దశాబ్దకాలంపైగా పనిచేస్తూ వస్తున్నప్పటికీ, వీరంతా 'నమోదు చేయబడని కార్మికులు'గానే పనిచేస్తున్నారు. వీరిలో అత్యధికులు నిరక్షరాస్యులుగా వుండి, స్థానిక భాష కూడా తెలియని వారుగా వున్నారు. ఈ కార్మికులను చెప్పనలవికాని బాధలకు గురిచేస్తోన్న 'లేబర్ ఏజెంట్లు', కార్మికుల వీసా, తదితర పత్రాలను తమ స్వాధీనంలోనే వుంచుకున్నారు. ఎలాంటి ఆశాలేని దయనీయ, నిస్పృహ వాతావరణంలో వారు బతుకులీడుస్తున్నారు. వీరి దుస్థితి ఏదో వ్యక్తులకు సంబంధించిన సమస్యగా తప్ప, పరిష్కరించవలసిన సామాజిక సమస్యగా చూడటంలేదు.

మన పాలకులు, ప్రభుత్వాలు వీరి దుస్థితిపట్ల చెవిటివిగా, గుడ్డివిగా వ్యవహరిస్తున్నాయి. భారత పాలకులు, ప్రభుత్వాలు మనదేశంలోనే వీరి జీవనాధారానికి తగిన స్థితిగతులను కల్పించగల్గితే, అనాధ కార్మికులుగా, బానిస కార్మికులుగా విదేశాలకు వెళ్ళవలసిన దుర్గతే వారికి పట్టదు.

కానీ మన పాలకులు, ప్రభుత్వాలు పార్లమెంటరీ అధికార క్రీడలో నిండా మునిగిపోయి, విదేశాలలోని ఈ కార్మికుల ప్రయోజనాల రక్షణకోసం పూనుకోవలసిన అవసరంగానీ, సమయంగానీ వారికి లేకపోయింది.

భారత కార్మికోద్యమం తన కర్తవ్యాలలో భాగంగా విదేశాలలోని భారత కార్మికుల సమస్యను తీసుకొని, దుర్భర జీవన పని పరిస్థితులలోనున్న వీరి ప్రయోజనాలను పరిరక్షించటంకోసం పోరాడాల్సి వుంది.

oooooo